## క్లుప్తంగా...

### మంద సంజీవ్‌రెడ్డి జన్మదిన వేడుకలు



సంజీవ్‌రెడ్డి దంపతులను గజమాలతో సత్కరించిన మంత్రి మల్లారెడ్డి

**బోడుప్పల్:** బోడుప్పల్ నగర పాలక సంస్థ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఆర్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈవేడుకలకు మంత్రి చామకూర మల్లారెడ్డి, మేయర్లు సామల బుచ్చిరెడ్డి, జక్క వెంకట్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మిరవిగౌడ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

### కళ్ల అద్దాల పంపిణీ

**మల్లాపూర్:** మధుర చారిటబుల్ ట్రస్ట్ సేవలను గత 20 ఏళ్లుగా ఉప్పల్ నియోజకవర్గంలో పేద ప్రజల కోసం విస్తృతంగా చేపడుతున్నామని ట్రస్ట్ ఫౌండర్ రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మల్లాపూర్ అశోక్‌నగర్‌లో కంటి వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న వారందరికి అద్దాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. ట్రస్ట్ ప్రతినిధులు పి.నర్సింహారెడ్డి, స్టార్‌రెడ్డి, రాజేష్, జమీలా భేగం, భానుగౌడ్,మల్లేష్ యాదవ్,రాఘవ, జహీరుద్దీన్, జితేందర్‌రెడ్డి, అమీర్, పవన్, రాజ్‌గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

### ఆపదలో అండగా బీఎల్‌ఆర్ ట్రస్టు



**కుషాయిగూడ:** ఆపదలో ఉన్నవారికి బీఎల్‌ఆర్ ట్రస్టు అండగా నిలుస్తుందని ట్రస్టు ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి అన్నారు. అనారోగ్యంతో మృతిచెందిన మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన అయిలవేని రాములు కుటుంబానికి 10 వేల ఆర్థికసాయం అందజేశారు. ట్రస్టు చైర్మన్, ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ఆర్థికసాయం అందజేసినట్లు జంపాల్ పేర్కొన్నారు.

### అమ్మవారికి లక్ష గాజులతో అలంకరణ



**బోడుప్పల్:** పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబికా దేవి అమ్మవారిని ఆదివారం లక్ష గాజులతో అలంకరించారు. అమ్మవారిని సౌభాగ్యలక్ష్మి, సుమంగళిలక్ష్మి, లక్ష నామాలతో కుంకమార్చన కార్యక్రమాలు నిర్వహించగా ఈకార్యక్రమానికి బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మిరవిగౌడ్, బోడుప్పల్ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ చీరాల నర్సింహ్మ హాజరయ్యారు. ఈసందర్భంగా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్ , ఆలయ ప్రధాన అర్చకులు చంద్ర శేఖర్ శర్మ పాల్గొన్నారు.

### నేతాజీనగర్ అధ్యక్షుడిగా లింగం యాదవ్



**రామంతాపూర్ :** డివిజన్ పరిధిలోని నేతాజీనగర్ కాలనీ సంక్షేమ సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా జి.లింగం యాదవ్, ప్రధాన కార్యదర్శిగా సీఎం మల్లేష్, కోశాధికారులుగా ఎం.శ్రీశైలం, చింటులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రధాన సలహాదారులు చాంద్‌పాషా, సిద్ది లింగం, యాదగిరి, పవన్, ఉపేందర్, వెంకటేష్‌చారి, రమేష్, సాయిబాబాలు పాల్గొన్నారు. అధ్యక్షులుగా ఎన్నికైన లింగం మాట్లాడుతూ రెండేళ్ళ పాటు ఉండే తన పదవీ కాలంలో ప్రజాప్రతినిధులు, అధికారులు కాలనీ పెద్దల సహకారంతో అన్ని రకాల అభివృద్ధి చేస్తానన్నారు.

### ఉరివేసుకొని డ్రైవర్ ఆత్మహత్య



తిమ్మన్న మృతదేహం

**అల్వాల్:** జీవితంపై విరక్తి చెంది ఓ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. సిఐ ఉపేందర్ తెలిపిన మేరకు.. కానాజిగూడలో నివాసముండే తిమ్మన్న (38) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదివారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య వివాహేతర సంబంధం పెటుకుందని తెలిసి అవమాన భారంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.



ఈసీఐఎల్ చౌరస్తాలో నివాళ్లు అర్పించిన ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, శిరీషారెడ్డి



కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్‌లో.. సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి

# వీరనారి చాకలి ఐలమ్మ

**కుషాయిగూడ:** తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకార్లకు ఎదురొడ్డి పోరాడిన చాకలి ఐలమ్మ వీరనారి అని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ఈసీఐఎల్‌లో ఆదివారం నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన ఏఎస్‌రావునగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషారెడ్డి, ఉప్పల్ కాంగ్రెస్ సీనియర్ నేత సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డిలతో కలిసి ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు ఐలమ్మ పోరాట పటిమను స్మరించుకున్నారు. మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, పావనీరెడ్డి పాల్గొన్నారు.

**చాకలి ఐలమ్మకు ఘన నివాళ్లు**

**కుషాయిగూడ:** తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ 38వ వర్ధంతి వేడుకలను ఆదివారం కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి హాజరై ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణిగౌడ్, చిత్తుల కిషోర్, వరప్రసాద్ పాల్గొన్నారు.

**ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి**

**రామంతాపూర్ :** ఇందిరానగర్ చౌరస్తాలో సీపీఎం, ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వీరనారి ఐలమ్మ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ముఖ్య పాత్ర పోషించి పలువురిని వెట్టిచాకిరి నుంచి కాపాడిందన్నారు.

**చాకలి ఐలమ్మకు ఘన నివాళి**

**మల్కాజిగిరి:** తెలంగాణ పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ 38 వ వర్ధంతి ఆనంద్‌బాగ్‌లో లక్ష్మీ నర్సింహ రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు.అధ్యక్ష, కార్యదర్శులు పోషయ్య, నాగరాజులు మాట్లాడుతూ ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు.

**వీర నారీ చాకలి ఐలమ్మ**

**ఉప్పల్:** చాకలి ఐలమ్మ వీరనారి అని, సమాజానికి అందించిన సేవలు మరువలేనివని ఉప్పల్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి బండారి లక్ష్మా రెడ్డి అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఉప్పల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## 30 ఏళ్ల కల సాకారమైంది : బీఎల్‌ఆర్



న్యూనర్సింహ్మనగర్ కాలనీలో సంబరాల్లో పాల్గొని మాట్లాడుతున్న ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ:** 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉప్పల్ నియోజకవర్గ ప్రజల సమస్యను ముఖ్యమంత్రి కేసీఆర్ సాకారం చేశారని ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని ఉప్పల్, చర్లపల్లి, మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ, రామంతాపూర్ డివిజన్‌లలోని పలు కాలనీలు ఇండస్ట్రియల్ జోన్‌లో ఉండటంతో అనేక ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను పలుమార్లు మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో మొదటగా కొన్ని కాలనీలను రెసిడెన్షియల్ జోన్‌లోకి మారుస్తు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ప్రకటించిన జాబితాలో మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని డైమండ్స్‌హిల్స్ కాలనీ, న్యూనర్సింహ్మనగర్, తిరుమలనగర్ ఎక్స్‌టెన్షన్ కాలనీలు ఉండటంతో స్థానికంగా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేస్తు ఆదివారం న్యూ నర్సింహ్మనగర్ కాలనీలో సంబరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి బీఎల్‌ఆర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్, గుమ్మడి జంపాల్‌రెడ్డి, శివ, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లకు సీటు కేటాయించకపోవడం శోచనీయం



సమావేశమైన ముదిరాజ్ సంఘం నేతలు

**గౌతంనగర్:** తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్‌లు, బీసీలకు జరుగుతున్న అన్యాయంపై మల్కాజిగిరి ముదిరాజ్ సంఘం నాయకులు పిట్ల మోహన్‌రాజ్ అధ్యక్షతను ఆదివారం ముదిరాజ్ సంఘం భవనంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్‌లు, బీసీలు 56 శాతం ఉన్నారని బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు అన్యాయం చేస్తున్నారని అభిప్రాయం వ్యక్తం చేశారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్‌లపై అధికార పార్టీ చిన్న చూపు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డు కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల ఆర్థికసాయం

**ఉప్పల్:** హోంగార్డు రాము బ్రెయిన్ స్ట్రోక్‌తో జూలై 12న మృతి చెందాడు. అతనికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారి కుటుంబాని ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో మల్కాజ్‌గిరి డివిజన్‌లోని ఏసీపీ,ఇన్‌స్పెక్టర్‌ల చొరవతో అందరూ కలిసి రూ.10 లక్షలను చెక్కు రూపంలో ఆదివారం వారి కుటుంబ సభ్యులకు రాచకొండ సీపీ డిఎస్ చౌహాన్ చేతుల మీదుగా అందజేశారు.

## లయన్స్ సేవలను మరింత విస్తృతం చేయాలి

**కుషాయిగూడ:** సేవాబావంతో ఏర్పడ్డ లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాలని లయన్స్ క్లబ్ 320సి డిస్ట్రిక్ గవర్నర్ కట్టంగూర్ హరీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ కాప్రా, ఏఎస్‌రావునగర్, స్నేహపురి ఆధ్వర్యంలో సాయిరాంనగర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవ చేయాలనే గొప్ప సంకల్పంతో లయన్స్ క్లబ్ వేదికగా చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాకవరం శ్రీదేవి, లయన్స్ ప్రతనిధులు విజయ్‌కుమార్, వరప్రసాద్ పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న లయన్స్‌క్లబ్ 320సి డిస్ట్రిక్ గవర్నర్ హరీష్‌రెడ్డి

## ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి

**బోడుప్పల్:** అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని తెలంగాణ రాష్ట్ర అంగన్‌వాడి టీచర్స్, హెల్పర్స్ ప్రధాన కార్యదర్శి నందూరి కరుణ కుమారి అన్నారు. బోడుప్పల్ ఇందిరానగర్ కాలనీలో అల్వాల్ ప్రాజెక్ట్‌లో అంగన్‌వాడి ఉద్యోగాల నిరవధిక సమ్మె గోడ పత్రిక ఆవిష్కరణకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడి టీచర్లను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీ అమలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ పెంపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రచ్చ కిషన్, ఏఐటియుసీ కో స్టేట్ కోశాధికారి ప్యారి జాన్, మండల ప్రధాన కార్యదర్శి దండు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గోడ పత్రిక ఆవిష్కరణలో పాల్గొన్న కరుణకుమారి

## ఘనంగా శ్రీవారి కల్యాణం

**మల్కాజిగిరి:** ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వెంకటేశ్వర దేవస్దానంలో శ్రీవారి కళ్యాణం ఘనంగా జరిగింది. ప్రధాన అర్చకులు ముడుంబై వేంకట రమణాచార్యులు, అర్చకులు తులసి రమణాచార్యులు కళ్యాణమహోత్సవాన్ని నిర్వహించారు.ఆలయ ఈవో రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ లోక కళ్యాణార్థం ప్రతి నెలా రెండవ ఆదివారం స్వామి వారి కళ్యాణం నిర్వహిస్తున్నామన్నారు.

## ఎంఆర్‌పీఎస్ నిరాహార దీక్షలు

**ఉప్పల్:** ఎస్సీవర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్ట బద్దత కల్పించాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న నిరసన నిరాహార దీక్షలు ఆదివారం రెండవ రోజుకు చేరుకుంది. ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో నిరహార దీక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. పంగ ప్రణయ్ కుమార్,బేరిపాక సిద్దులు, త్రినేత్ర, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతాం



తాగునీటి పైపులైన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్

**బోడుప్పల్:** డివిజన్ పరిధిలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని 4వ డివిజన్ కార్పొరేటర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్ అన్నారు. 4వ డివిజన్ న్యూ భవానినగర్ కాలనీలో మంచినీటి పైపులైన్ ప్రారంభోత్సవంలో ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో తాగునీరు, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, విద్యుత్, పారిశుద్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## భారీ వర్షానికి జలమయమైన రోడ్లు



రామంతాపూర్‌లో వర్షానికి జలమయమైన రోడ్లు

**రామంతాపూర్ :** డివిజన్ పరిధిలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా సత్యనారాయణ స్వామి దేవాలయం చౌరస్తా , వివేక్‌నగర్, రాంశంకర్‌నగర్, రాంరెడ్డినగర్, బైపాస్ రోడ్డు, శ్రీనగర్ కాలనీ, భరత్‌నగర్, శాంతినగర్‌లో రోడ్లపైనే భారీగా వర్షం నీరు నిండిపోయింది.

## ప్రజా గాయకుడు గద్దర్ మరణం తీరనిలోటు

**అల్వాల్:** ప్రజా గాయకుడు గద్దర్ మరణం తీరని లోటు అని ప్రొఫెసర్ కాశీం అన్నారు. ఆదివారం సుభాష్‌నగర్‌లో ఎర్రజెండా బస్తీ వాసులు ప్రజాకవి గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రొ. కాశీం, గద్దర్ కూతురు వెన్నెల హాజరై మాట్లాడుతూ ఎక్కడైతే అణచివేతకు గురి అవుతున్నప్పుడు అక్కడనే గద్దర్ ఉంటారన్నారు. ఆయన బడుగు బలహీన వర్గాలకు బాసటగా నిలిచి నవ సమాజం స్థాపించేందుకు ఎనలేని కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో సీఎల్. యాదగిరి, అశోక్, లక్ష్మణ్, లింగస్వామి పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వెన్నెల

## అమ్మవారి పూజల్లో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



**మౌలాలి:** నేరేడ్‌మెట్ వాజ్‌పేయ్‌నగర్ కోర్టు వద్ద గల అమ్మవారి దేవాలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరై పూజలు చేశారు.

## పాలాభిషేకం



**ఉప్పల్:** ఓపెన్ స్పేస్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్‌గా ప్రభుత్వ ఉత్తర్వులు జారీ కావడంతో ఆదివారం చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ఆధ్వర్యంలో కేసీఆర్,కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో శివారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహులు, రామరాజు. శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి



ప్రకాష్‌రెడ్డి

**మల్లాపూర్:** నాచారం డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానని నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీఎస్. ప్రకాష్ రెడ్డి అన్నారు. తనపై నమ్మకంతో రెండవసారి డివిజన్ అధ్యక్షుడిగా నియమించినందుకు కాంగ్రెస్ పార్టీ పెద్దలకు కృతజ్ఞతాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి జరుగుతుందన్నారు.

## కాంగ్రెస్ శ్రేణులు సంఘటితం కావాలి



**ఉప్పల్ :** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో చిలుకానగర్ డివిజన్‌లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్రను నిర్వహించారు. శ్రీనివాస బేకరి, ప్రశాంత్‌నగర్, ఎస్‌బి కాలని, అన్నపూర్ణ కాలని, శ్రీనివాస హైట్స్ వరకు సాగిన కార్యక్రమంలో రాగిడి లక్ష్మారెడ్డి హాజరై కాంగ్రెస్ పథకాలను ప్రజలకు వివరించారు. రామంతాపూర్, చిలుకానగర్ హబ్సిగూడ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీని గెలిపించండి

**మల్కాజిగిరి:**రాష్ట్రంలో ప్రజా సంక్షేమం రావాలంటే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ విభాగం వర్కింగ్ కమిటీ చైర్మన్ బొనగిరి సురేష్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు.ఆదివారం మినీట్యాంక్ బండ్ పైన మార్నింగ్ వాకర్స్‌తో వన్ టు వన్ కార్యక్రమం నిర్వహించారు. సురేష్‌యాదవ్ మాట్లాడుతూ ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలను తెలియజేశారన్నారు.



మినీట్యాంక్ పై ప్రచారం నిర్వహించిన సురేష్‌యాదవ్



## మల్కాజిగిరి సీటు కోసం బీజేపీ నేతల దరఖాస్తులు



పార్టీ కార్యాలయంలో దరఖాస్తును అందజేస్తున్న సామల సత్తిరెడ్డి



దరఖాస్తు అందజేస్తున్న లక్ష్మణ్‌రావు



దరఖాస్తును అందచేస్తున్న కల్లు వెంకట్‌రెడ్డి

**అల్వాల్/గౌతంనగర్:** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ తరుపున మల్కాజిగిరి సీటు తనకు కేటాయించాలని అల్వాల్‌కు చెందిన మాజీ కౌన్సిలర్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సామల సత్తిరెడ్డి ఆదివారం నగరంలోకి పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 35 ఏళ్ల అనుభవం ఉన్నా వ్యక్తినని, పదవి ఉన్నా లేకున్న నిత్యం ప్రజలలో ఉండి ప్రజా సమస్యలను తెలుసుకుంటు పరిష్కరిస్తూ అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొంటు ఓ మల్కాజిగిరి సుపిరిచితుడుగా ఉన్నాతనకు టికెట్ కెటాయించాలని కోరారు.

**గౌతంనగర్:** భారతీయ జనతాపార్టీ తరుపున తనకు మల్కాజిగిరి అసెంబ్లీ సీటను కెటాయించాలని బీజేపీ గౌతంనగర్ డివిజన్ అధ్యక్షులు లక్ష్మణ్‌రావు ఆదివారం పార్టీ కార్యాలయంలో తన దరఖాస్తును అందజేశారు.

**బీజేపీ టిక్కెట్ కేటాయించండి**

హబ్సిగూడ: రానున్న ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గం నుండి అసెంబ్లీ సీటును కేటాయించాలని కోరుతూ హబ్సిగూడకు చెందిన బీజేపీ నాయకులు కల్లు వెంకట్‌రెడ్డి ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 70 సంవత్సరాలుగా తన కుటుంబం దేశం కోసం పనిచేసిందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా వందలాది మంది ప్రజలకు సేవ చేశానని, అదేవిధంగా కరోనా సమయంలో ఎంతో సేవ చేశానన్నారు. ఉప్పల్ నియోజకవర్గ పౌరులందరికీ సేవ చేయడంలో అందుబాటులో ఉండానన్నారు.